క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ధర్పల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వాహనదారులకు పుష్పగుచ్ఛం అందించి హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. రాత్రి సమయంలో ప్రమాదాల నివారణకు వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు. ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, డేనియల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

మోపాల్: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను హెచ్‌ఎం సత్యనారాయణ అభినందించారు. మోపాల్ మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో వంద మంది విద్యార్థులకు కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర వస్తువులను శనివారం పంపిణీ చేశారు. కాగా పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ఇన్నోవేటివ్ వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, అక్బర్ భాషా, వసంత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఇందల్వాయి: మండలంలోని గండితండా జీపీ సెక్రటరి అశోక్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ అనీల గ్రామ పాఠశాల విద్యార్థులకు రూ. పదివేలు విలువ చేసే నోట్స్ బుక్స్, పెన్నులను శనివారం అందించారు. ఎంఈవో శ్రీధర్, ఎంపీడీవో అనంత్‌రావు, హెచ్‌ఎం పరమేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేంద్ర మంత్రి కార్యక్రమాన్ని అడ్డుకుంటాం


నిజామాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రి అమిత్ షా నిర్వహించే కార్యక్రమాన్ని అడ్డుకుంటామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ అన్నారు. శనివారం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన హోం మంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని లేదంటే జిల్లా పర్యటనను అడ్డుకుంటామన్నారు. నాయకులు రాజు, ఆజాద్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం




సిరికొండ: మండలంలోని కొండాపూర్‌లో పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. 350 మీటర్ల సీసీ డ్రైయినేజీ నిర్మాణానికి రూ. ఏడున్నర లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. మూడు లక్షల నిధులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంజూరు చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల బుచ్చన్న, ఆకుల జగన్, నీరటి శ్రీధర్, గాసొద్దీన్, కిశోర్‌గౌడ్, చంద్రాగౌడ్, ఎల్లయ్య, శంకర్‌గౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రెడ్‌క్రాస్‌లో జమాల్‌పూర్ విఠల్ వ్యాస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జర్నలిస్టు విఠల్ వ్యాస్ ఐదో వర్ధంతి సందర్భంగా 19 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యులు బొద్దుల రాజేంద్రప్రసాద్, ధన్‌పాల్ వినయ్, సందీప్‌రావు, సొసైటీ అధ్యక్షుడు జమాల్‌పూర్ రాజశేఖర్, రెడ్‌క్రాస్ చైర్మన్ ఆంజనేయులు, మెడికల్ ఆఫీసర్ వి రాజేశ్, విజయానంద్, భైర శేఖర్, చింతల గంగాదాస్, అర్వింద్, పంచరెడ్డి శ్రీకాంత్, సుభాష్, మధుసూదన్, ఆశ నారాయణ, దయాకర్ గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు పీహెచ్‌డీ ప్రదానం



డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న మైస చంద్రశేఖర్ ఏపీలోని ద్రవిడ విశ్వవిద్యాలయం నుంచి గణిత శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను శనివారం అందుకున్నారు. 'సమ్ జనరలైజేషన్స్ యూసింగ్ డిఫరెంట్ టైప్స్ ఆఫ్ కంపెటబిలిటి' అనే అంశంపై గ్రంథాన్ని సమర్పించారు. పీహెచ్‌డీ పొందిన చంద్రశేఖర్‌ను యూనివర్సిటీ అధ్యాపకులు అభినందించారు.

వ్యవసాయానికి సాంకేతికతను జోడించాలి

- డివిజనల్ ఆగ్రోనామిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి
- బాడ్సిలో జిల్లాస్థాయి డ్రోన్ సాంకేతికత ప్రదర్శన



వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ప్రదర్శనను వీక్షిస్తున్న రైతులు

మోపాల్: వ్యవసాయరంగంలో కూలీల కొరతను అధిగమించేందుకు సాంకేతికతను జోడించాలని, తద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని డివిజనల్ ఆగ్రోనామిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలో అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 ఉత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి డ్రోన్ సాంకేతికత ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన కల్పించేందుకు డ్రోన్ ప్రదర్శనను చేపట్టారు. డ్రోన్ల వినియోగం, వాటి పద్ధతులు, ప్రయోజనాలు, వ్యవసాయ రంగంలో వాటి పాత్రపై నానో బిజినెస్ మేనేజర్ ఎల్ఎస్ స్వరూప్, సీనియర్ ఆగ్రోనామిస్ట్ పాపిరెడ్డి, ఆగ్రోనామిస్ట్ డాక్టర్ వంశీ రైతులకు వివరించారు. డ్రోన్ల సహాయంతో కీటక నాశినుల స్ప్రే, పంటల ఆరోగ్య నిర్ధారణ, భూమి పర్యవేక్షణ, తదితర అంశాలపై వ్యవసాయ క్షేత్రంలో ప్రదర్శనలిచ్చారు. రైతులు ప్రత్యక్షంగా వీక్షించి, నిపుణులతో చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి, డైరెక్టర్ పృథ్వీరాజ్, సహకారశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాస్, రైతులు మహిపాల్‌రెడ్డి, శేరు మల్లయ్య, ఉపసర్పంచ్ రవి, రైతులు, సంఘాల ప్రతినిధులుపాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ బహుభాషా కోవిదుడు

నుడా చైర్మన్ కేశ వేణు

మోపాల్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు బహుభాషా కోవిదుడు అని, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. శనివారం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నర్సింహారావు 104వ జయంతి సందర్భంగా నగరశివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీవీ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల వల్లే దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శశికాంత్ కులకర్ణి మాట్లాడుతూ.. బ్రాహ్మణ ముద్దుబిడ్డ, అపర చాణక్యుడు పీవీ నర్సింహారావు అని, వారిని భారతరత్నతో గతంలోనే కేంద్ర ప్రభుత్వం సత్కరించడం బ్రాహ్మణ జాతికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నుడా మాజీ చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కంజర్‌కర్ భూపతిరావు, రమేశ్‌బాబు,కోశవి విజయ్‌కుమార్, మిలింద్, రమేశ్, కిరణ్ దేశ్‌ముఖ్, పుల్కల్ రమేశ్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, జయంత్‌రావు, మల్లికార్జున్, లక్ష్మీకాంత్, అప్పాల కిష్టయ్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.



బోర్గాం(పి)లో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కేశ వేణు, ఈగ సంజీవ్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో..

నిజామాబాద్ రూరల్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారవు జయంతి వేడుకల్లో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఫ్లెక్సీల ఏర్పాటు

జిల్లా కేంద్రానికి ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారు. పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నగరంలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. డీఎస్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కిసాన్ సమ్మేళన్(రైతు సమ్మేళనం) బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగించనున్నారు. బైపాస్ చౌరస్తాలో భారీ ఎత్తున సిగ్నల్ లైట్స్, కెమెరాలను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్







రోడ్డు ఇలా.. హైస్కూల్‌కు వెళ్లేదెలా..

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్‌లో ప్రధాన బీటీ రోడ్డు పూర్తిగా గుంతలు పడి అధ్వానంగా మారింది. గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు ఇదే రోడ్డుగుండా జెడ్పీ హైస్కూల్‌కు వెళ్తుంటారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నీరు ఎక్కువగా నిలిచినప్పుడు గుంతలు కనబడక సైకిల్ పై వెళ్లే విద్యార్థులు, బైక్‌లపై వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన రాంపూర్ జెడ్పీహైస్కూల్‌కు వెళ్లే రోడ్డు

నాణ్యత డొల్ల!

- పనులు చేపట్టిన మూడు నెలలకే పగుళ్లు ఏర్పడిన రోడ్డు

ఇందల్వాయి: ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో వెంగల్‌పాడ్ వద్ద నూతనంగా నిర్మించిన హైలెవెల్ వంతెనకు ఇరువైపుల వేసిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి కుంగి పగుళ్లు ఏర్పడ్డాయి. ఏళ్ల తరబడి మన్నికగా ఉండాల్సిన రోడ్డు మూడు నెలలకే కుంగడంపై వాహనదారులు నాణ్యత లోపాలను విమర్శిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల పోసిన మొరం వర్షానికి కొట్టుకుపోయింది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పాడవకముందే మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



పగుళ్లు ఏర్పడ్డ రోడ్డు

నియామకం



మోపాల్: సేవాలాల్ సేన మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మండలంలోని అమ్రాబాద్‌కు చెందిన బానోత్ నరేశ్ నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్ నరేశ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నరేశ్‌నాయక్ మాట్లాడు తూ.. తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సంజీవ్ నాయక్‌కు, రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. గిరిజన జాతి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి శక్తి వంచన లేకుండా పని చేస్తానని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై సర్వే

నిజామాబాద్అర్బన్/ సిరికొండ: నగరంలోని శంకర్‌భవన్ స్కూల్‌లో విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, నాయకుడు నిఖిల్ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు తెలుసుకొని సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, రఘు తదితరులు పాల్గొన్నారు. సిరికొండ మండలంలోని కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు మారుపాక రాజేశ్, రితీశ్‌గౌడ్, నవీన్, విశ్వతేజ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

నిజామాబాద్ సిటీ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వెజిటేబుల్ ఆటో-మోటర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శివకుమార్ అన్నారు. నగరంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఇమ్రాన్, సురేశ్, బాబా ప్రసాద్, హైమద్, రంజిత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు శివ

ముషీర్‌నగర్‌లో వైద్య శిబిరం

సిరికొండ: సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ముషీర్‌నగర్‌లో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. 67 మందికి వివిధ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

నేటి చిత్రం



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

ప్రధాన రహదారిపై గుంతలు

సిరికొండ: సిరికొండ నుంచి గడ్కోల్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర గుంతలను పూడ్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– సి బాలకిషన్, గడ్కోల్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 | నిజామాబాద్ రూరల్ - 97053 46541

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

మోపాల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మోపాల్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించిన ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మి గెలిపించారని అన్నారు. కానీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా పూర్తి స్థాయిలో హామీలను అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు పెన్షన్, ఆటో కార్మికులకు రూ.12వేలు, కౌలు రైతుల హామీలు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఉద్యమ పెన్షన్, తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్, నాయకులు రవితేజ, గుర్రం రమాదేవి, బొడ్డు సునీత, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ

డిచ్‌పల్లి: విధి నిర్వహణలో పోలీసులు ఒత్తిడికి గురవుతుంటారని, ఒత్తిడిని జయించి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని టీజీఎస్‌పీ ఏడో బెటాలియన్, డిచ్‌పల్లి కమాండెంట్ పి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం బెటాలియన్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హాస్పిటల్‌కు చెందిన వివిధ విభాగాల డాక్టర్‌లు బెటాలియన్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కమాండెంట్ మాట్లాడుతూ.. మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కేపీ శరత్‌కుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కమాండెంట్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పరీక్షల నిర్వహణ అధికారికి సన్మానం

నిజామాబాద్అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఇటీవల పరీక్షల నియంత్రణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణను ధర్మ టీచర్స్ యూనియన్ నాయకులు శనివారం సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతేకాకుండా ఇటీవల పదోన్నతి పొందిన జిల్లా విద్యాశాఖ ఉద్యోగి దీపక్‌ను సన్మానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల రమేశ్, నాయకులు రాజు, సాయినాద్ తదితరులు పాల్గొన్నారు.



బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,900	వెండి(కిలో)	1,10,500
22 క్యారెట్స్	90,372		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	160
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీన్సుకాయ	70	100	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	15	30
వంకాయ	30	60	గోబిపువ్వు	20	40
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	60	100	కరివేపాకు	40	60
కొత్తిమీర	30	50	చామగడ్డ	30	50
పుదీనా	60	90	చిక్కుడుకాయ	40	70

-సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 కన్నప్ప-10.40,3.40,7.10, 10.35
స్క్రీన్-2 కుబేర(తెలుగు)-10.30, 1.55
మార్గన్(తెలుగు)-5.25, 10.50
స్క్రీన్-3 కన్నప్ప(తెలుగు)-12.25
కుబేర(తెలుగు)-3.50, 7.15, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 కన్నప్ప(తెలుగు)-11.20, 3.00, 6.40, 10.20
స్క్రీన్-2 కుబేర(తెలుగు-11.40, 3.20, 7.00, 10.40
స్క్రీన్-3 ఎఫ్ వన్ (తెలుగు)-10.05,1.20
మార్గన్(తెలుగు)-4.35
ఎఫ్ వన్ (ఇంగ్లీష్)-7.25, 10.40
స్క్రీన్ -4 సితారే జమీన్ పర్ (హిందీ)-10.10, 4.30, 10.50
మా (హిందీ)-1.35, 7.55

విజయ్ కుబేర దేవి కన్నప్ప
నటరాజ్ మా (హిందీ) లలితామహల్ మార్గన్